



సైదాపూర్‌లో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న పట్టభద్రులు



కరీంనగర్‌లో ఓటువేసేందుకు క్యూలో నిల్చున్న కలెక్టర్ పమేలా సత్పతి



ప్రశాంతంగా పోలింగ్



కరీంనగర్‌లో ఓటువేసేందుకు బారులు తీరిన ఓటర్లు

- పట్టభద్రుల స్థానంలో 70.42 శాతం పోలింగ్
- ఉపాధ్యాయుల స్థానంలో 91.9 శాతం ఓటు హక్కు వినియోగం
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బీసీ గాలి
- 3న అంబేడ్కర్ స్టేడియంలో ఓట్ల లెక్కింపు

కరీంనగర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలకు పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పట్టభద్రుల స్థానంలో 70.42శాతం, ఉపాధ్యాయుల స్థానంలో 91.9 శాతం మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకున్నారు. మధ్యాహ్నం వరకు మందకొడిగా సాగిన పోలింగ్ ఆ తర్వాత ఊపందుకొని సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటు వేసేందుకు అవకాశముండగా 4 గంటలలోపు పోలింగ్ కేంద్రాలకు వచ్చిన ఓటర్లందరికీ ఓటు వేయడానికి అనుమతించారు. పట్టభద్రుల నియోజకవర్గంలో 3,55,159 మంది ఓటర్లు ఉండగా 2,50,106 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 1,62,561 మంది పురుషులు, 87,544 మంది మహిళలు ఓటు వేశారు. ఉపాధ్యాయుల స్థానంలో 27,088 మంది ఓటర్లు ఉండగా 24,895 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 15,743 మంది పురుషులు, 9,152 మంది మహిళ ఓటర్లు వేటు వేసిన వారిలో ఉన్నారు.

ఉమ్మడి జిల్లాలో పోలింగ్ వివరాలు:

పట్టభద్రుల నియోజకవర్గం

క్రసం.	జిల్లా	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	శాతం
1.	కరీంనగర్	71,545	46,247	64.64
2.	రాజన్న సిరిసిల్ల	22,397	15,394	68.73
3.	జగిత్యాల	35,281	24,862	70.47
4.	పెద్దపల్లి	31,037	21,259	68.5

ఉపాధ్యాయుల నియోజకవర్గం

క్రసం.	జిల్లా	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	శాతం
1.	కరీంనగర్	4,305	3,871	89.92
2.	రాజన్న సిరిసిల్ల	950	899	94.63
3.	జగిత్యాల	1,769	1,635	92.43
4.	పెద్దపల్లి	1,111	1,049	94.42

మందకొడిగా ప్రారంభమై..

ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా 10 గంటల వరకు పట్టభద్రుల స్థానంలో 7.1శాతం, ఉపాధ్యాయుల నియోజకవర్గంలో 12.72శాతం పోలింగ్ జరిగింది. మధ్యాహ్నం 12 గంటల వరకు పట్టభద్రుల స్థానంలో 19.20 శాతం, ఉపాధ్యాయుల స్థానంలో 33.98శాతం మంది ఓటు వేశారు. మధ్యాహ్నం 2 గంటల వరకు ఓటు వేసేందుకు వచ్చేవారి సంఖ్య క్రమేపి పెరిగి పట్టభద్రుల స్థానంలో 40.61శాతం, ఉపాధ్యాయుల స్థానంలో 63.49 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ ముగిసేవరకు పట్టభద్రుల స్థానంలో 70.42శాతం, ఉపాధ్యాయుల స్థానంలో 91.90శాతం ఓటింగ్ జరిగింది.

ఓటు హక్కు వినియోగించుకున్న అభ్యర్థులు, ప్రముఖులు

పట్టభద్రుల స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీలో ఉన్న వి నరేందర్‌రెడ్డి, ఫార్వర్డ్‌బ్లాక్ అభ్యర్థి సర్దార్ రవీందర్‌సింగ్, ఇండిపెండెంట్ అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు, కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతి కరీంనగర్‌లోనే ఓటు హక్కు వినియోగించుకున్నారు. బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ రాజన్న సిరిసిల్ల జిల్లా బోయిన్‌పల్లిలో తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ సందర్భంగా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంతంగా పోలింగ్ ముగిసింది.

పట్టభద్రుల నియోజకవర్గం
ఓటర్లు: 3,55,159
ఓటుహక్కు వినియోగించుకున్నవారు: 2,50,106 (70.42 శాతం)
పురుషులు: 1,62,561
మహిళలు: 87,544

ఉపాధ్యాయుల నియోజకవర్గం
ఓటర్లు: 27,088
ఓటుహక్కు వినియోగించుకున్నవారు: 24,895 (91.9 శాతం)
పురుషులు: 15,743
మహిళలు: 9,152

జిల్లాలో పోలింగ్ వివరాలు

కరీంనగర్ జిల్లాలో పట్టభద్రుల స్థానంలో 42,806 మంది పురుషులు, 28, 739 మంది మహిళలు ఓటర్లుగా ఉండగా 28,012 మంది పురుషులు, 18,235 మంది మహిళలు మొత్తం 46,247 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లాలో 64.64 శాతం పోలింగ్ నమోదైంది. ఉపాధ్యాయ నియోజకవర్గంలో జిల్లాలో 4,305 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా 3,871 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 89.92శాతం ఉపాధ్యాయ స్థానంలో పోలింగ్ జరిగింది. అత్యధికంగాజయశంకర్ భూపాలపల్లిలో 79.05 శాతం నమోదు కాగా, కరీంనగర్ జిల్లాలో అత్యల్పం 64.64శాతం పోలింగ్ నమోదైంది.

ఉమ్మడి జిల్లాలో	అత్యధిక పోలింగ్	అత్యల్ప పోలింగ్
పట్టభద్రులు	జగిత్యాల (70.47శాతం)	కరీంనగర్ (64.64 శాతం)
ఉపాధ్యాయులు	రాజన్న సిరిసిల్ల (94.63శాతం)	కరీంనగర్ (89.92 శాతం)

కాంగ్రెస్, బీజేపీ మధ్య హోరాహోరీ
గట్టి పోటీ ఇచ్చిన బీఎస్పీ అభ్యర్థి

కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల పరిధిలో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో మొదటి నుంచి భావించిన విధంగానే ముక్కోణపు పోటీ జరిగింది. కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ అభ్యర్థులకు అనుకూలంగా మెజార్టీ ఓట్లు పోలైనట్లు పోలింగ్ సరళి ద్వారా తెలిసింది. హోరాహోరీగా జరిగిన ఈ పోటీలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ వాదానికి పెద్ద పీట వేసి బీఎస్పీ అభ్యర్థి బీసీ సామాజికవర్గానికి చెందిన ప్రసన్న హరికృష్ణకు మద్దతుగా నిలిచినట్లు, ఈ ఉమ్మడి జిల్లాలో ఆయనకే అత్యధిక ఓట్లు వచ్చే అవకాశాలున్నట్లు చర్చించుకుంటున్నారు. ఉమ్మడి నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్, బీజేపీ హవా ఎక్కువగా కనిపించినట్లు చెబుతున్నారు. ఈ రెండు పార్టీల అభ్యర్థులకు బీఎస్పీ అభ్యర్థి గట్టి పోటీ ఇచ్చి ముక్కోణపు పోటీగా మార్చినా ఎమ్మెల్సీ స్థానాన్ని కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల్లో ఒకరు కైవసం చేసుకునే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా వి నరేందర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి సి అంజిరెడ్డి, బీఎస్పీ అభ్యర్థిగా ప్రసన్న హరికృష్ణ పోటీ చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులకు గట్టి పోటీ ఇచ్చారు. పోలింగ్ సరళి ఆయనకు అనుకూలంగా ఉన్నట్లు వ్యక్తమైంది. మల్క కొమురయ్యకు, పీఆర్‌టీయూ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ జాక్టో అభ్యర్థి కూర రఘోత్తంరెడ్డి గట్టి పోటీ ఇచ్చారు. మార్చి 3న జరిగే ఓట్ల లెక్కింపులో విజేతలెవో వెల్లడికానున్నది.

ఎమ్మెల్సీ ఎన్నికల సైడ్ లైట్స్

- ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా రెండు గంటలపాటు మందకొడిగా సాగింది. మొదటి రెండు గంటల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీకి 5.2 శాతం, టీచర్ ఎమ్మెల్సీకి 11.58 శాతం ఓట్లు మాత్రమేపోలయ్యాయి.
- 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటలు పోలింగ్ ముగిసే వరకు పెద్ద సంఖ్యలో ఓటర్లు తరలిరావడంతో దాదాపు అన్ని పోలింగ్ బూత్‌ల్లో ఓటర్లు క్యూలో నిలుచొని ఓటుహక్కును వినియోగించుకున్నారు.
- ముకరంపుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కలెక్టర్ పమేలాసత్పతి క్యూలైన్‌లో నిలుచొని గ్రాడ్యుయేట్ ఓటు హక్కును వినియోగించుకున్నారు.
- వాణినికేతన్ కళాశాలలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, బీఎస్పీ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ, స్వతంత్ర అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్, వినోద్‌కుమార్ ఎమ్మెల్సీ బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణను పలకరించారు.
- ప్రభుత్వ ఉన్నత పాఠశాల దస్గర్‌వాడీ పోలింగ్ కేంద్రంలో కాంగ్రెస్ పట్టభద్రుల అభ్యర్థి డాక్టర్ వి నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఫార్వర్డ్‌బ్లాక్ అభ్యర్థి రవీందర్‌సింగ్ ఓటు హక్కును వినియోగించుకున్నారు.
- సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కేంద్రంలోకి చేరిన వారికి ప్రిసైడింగ్ అధికారులు ఇన్‌టైంలో వచ్చినట్లు టోకెన్లు ఇచ్చి వారికి మాత్రమే ఓటు వేసేందుకు అనుమతించారు.
- సాయంత్రం 4 గంటల తర్వాత పోలింగ్ కేంద్రానికి చాలా మంది ఓటర్లు రాగా ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చిన వారిని అనుమతించక పోవడంతో అక్కడక్కడ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అయినా వారు నో ఎంట్రీ చెప్పడంతో నిరాశతో వెనుదిరిగారు.
- పోలింగ్ కేంద్రంలోకి మొబైల్ (సెల్‌ఫోన్)ను అనుమతించక పోవడంతో చాలా మంది పోలింగ్ కేంద్రం బయట ఎక్కడ ఫోన్ భద్రత పరుచుకోవాలో తెలియక ఇబ్బంది పడ్డారు.
- సాధారణ ఎన్నికల తరహాలో పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేయడంతో 100 మీటర్ల దూరంలో కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ అభ్యర్థుల పక్షాన ఆయా పార్టీ శ్రేణులు, మద్దతుదారులు పోలింగ్ చిటీ రాసిస్తూ తమ అభ్యర్థికి ఓటు వేయాలని కోరారు.
- మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగానే ఉన్నప్పటికి ఓటర్లు పోలింగ్ కేంద్రానికి వచ్చి బారులు తీరి ఓటు హక్కును వినియోగించుకున్నారు.
- పోలింగ్ కేంద్రాల్లో మెడికల్ క్యాంపు, మంచినీటి సౌకర్యం కల్పించడంతోపాటు వృద్ధులు, దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ సిబ్బంది వారికి సహకారాన్ని అందించారు.
- పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 56 మంది అభ్యర్థులు పోటీ చేయడంతో భారీ సైజులో బ్యాలెట్‌ను ఏర్పాటు చేయడంతో అభ్యర్థులను వెతుక్కొని ఓటు వేసేందుకు ఎక్కువ సమయమే తీసుకున్నారు.
- నగరంలోని సుభాష్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో శ్రీరామోజు అఖిల అనే యువతి అమెరికాలోని డల్లాస్ నుంచి ఓటు వేసేందుకు వచ్చినట్లు చెప్పడం అందరినీ ఆశ్చర్య పరిచింది.

ఓటేసిన..

యువతులు..



చంటిబిడ్డతో మహిళ..



సీనియర్ గ్రాడ్యుయేట్లు..



పోలీసు అధికారులు..



పోలింగ్ కేంద్రానికి ఆలస్యంగా...

కరీంనగర్ అర్బన్ కరీంనగర్ డాక్టర్స్ స్ట్రీట్‌లోని బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో పలువురు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు సమయం ముగిసిన తరువాత సాయంత్రం 4 గంటల 5 నిమిషాలకు చేరుకున్నారు. అప్పటికే కళాశాల గేట్ మూసివేసి, ఓటు వేసేందుకు క్యూలైన్‌లో వేచి ఉన్న వారందరికి పోలింగ్ ఆఫీసర్ టోకెన్‌లు ఇచ్చారు. సాయంత్రం 4 గంటల తరువాత పోలింగ్ కేంద్రాఆనికి వచ్చిన ఓటర్లకు ఓటు వేసేందుకు అవకాశం లేనందున మరలిపోయారు. ఈ సందర్భంలో ఒక మాజీ మహిళా కార్పొరేటర్ పోలింగ్ కేంద్రం వద్దకు రాగా ఆమెతో వచ్చిన ఓటర్లను ఆలస్యంగా వచ్చినందున అక్కడ ఉన్న పోలీసు అధికారులు లోపలికి అనుమతించలేదు. దీంతో మాజీ కార్పొరేటర్ పోలీసు అధికారితో వాగ్వాదానికి దిగారు. ట్రాఫిక్‌జామ్ కారణంగానే రెండునిమిషాలు ఆలస్యమైందని పోలీసు అధికారితో చెప్పారు. పోలింగ్ ఆఫీసర్ ఆదేశాల మేరకే తాము నడుచుకుంటామని, తమ చేతిలో ఏమీ లేదని సీఐ చెప్పి పంపించారు.



హుజూరాబాద్‌లో పోలింగ్ కేంద్రానికి పరుగున వస్తున్న ఓటర్లు



స్ట్రాంగ్ రూమ్‌కు చేరిన బ్యాలెట్ బాక్సులు..

పోలింగ్ ముగిసిన తర్వాత నియోజకవర్గ పరిధిలో పోలింగ్ జరిగిన 773 కేంద్రాల నుంచి బ్యాలెట్ బాక్సులను కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఉన్న అంబేద్కర్ స్టేడియంకు భారీ బందోబస్తు మధ్య తరలించారు.. మూడు రోజులపాటు ఈ బ్యాలెట్ బాక్సులను ఇక్కడే ఉంచి మార్చి 3న ఈ కేంద్రంలోనే ఓట్ల లెక్కింపు చేపట్టేందుకు ఏర్పాట్లు చేశారు.

పోలింగ్ సందర్భంగా కట్టుదిట్టమైన భద్రత

- పోలీంగ్ స్టేషన్లు, స్ట్రాంగ్‌రూంల వద్ద బందోబస్తును తనిఖీ చేసిన సీపీ

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశామని సీపీ అభిషేక్ మొహంతి తెలిపారు. గురువారం ఉదయం నుంచి పోలింగ్ ముగిసే వరకు సీపీ కమిషనరేట్ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను, బ్యాలట్ బాక్సలను భద్రపరచనున్న అంబేద్కర్ స్టేడియం ఇండోర్ స్టేడియంలోని స్ట్రాంగ్ రూంలను సందర్శించి అక్కడ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ కమిషనేట్ వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకున్నామన్నారు. ఉద యం నుంచి సాయంత్రం వరకు కమిషనరేట్ వ్యాప్తంగా స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, మొబైల్ పెట్రోలింగ్ పోలీసుటీంలు తనిఖీలు చేస్తూ పోలింగ్ సాఫీగా జరిగేందుకు చర్యలు చేపట్టామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఇప్పటికే సీసీ కెమరాలతో నిఘా ఏర్పాటు ఉందని, సీసీ కెమరాల ద్వారా పోలింగ్ కేంద్రాల వద్ద పరిస్థితిని ఎప్పటికప్పుడు అధికారులు గమనిస్తున్నారన్నారు. కమిషనరేట్ వ్యాప్తంగా 400 మందిపైగా పోలీసు అధికారులు, సిబ్బందిని బందోబస్తుకు వినియోగించామని సీపీ తెలిపారు. ఆయన వెంట టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జి నరేందర్, టౌన్ ఏసీపీ వెంకటస్వామి, సీఐలు ఉన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీపీ అభిషేక్ మొహంతి

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


మృతుడు దేవరాజు

ముస్తాబాద్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. మండల కేంద్రానికి చెందిన ఒల్లెపు దేవరాజు(30) అనే వ్యక్తి వ్యవసాయ బావిలో పూడిక తీత పనులు చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్థులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్‌లోని ఓ రైతుకు చెందిన వ్యవసాయ బావిలో దేవరాజు పూడికతీత పనులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. అక్కడున్న వారు వెంటనే అతన్ని స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దేవరాజుకు భార్య లలిత, ఇద్దరు పిల్లలున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి


లక్ష్మీనర్సు(ఫైల్)

ముస్తాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నామాపూర్ గ్రామానికి చెందిన అరె లక్ష్మీనర్సు(54) అనే రైతు చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మరణించాడు. గ్రామానికి చెందిన లక్ష్మీనర్సు అనే రైతు కొన్ని రోజుల క్రితం పొలం వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ వైర్ పోవడంతో వేద్దామని ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కాడు. ప్రమాదవశాత్తు షాక్ రావడంతో సిద్దిపేటలోని ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. లక్ష్మీనర్సుకు భార్య భూలక్ష్మీ, కొడుకు నవీన్‌లున్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎంపీపీ మంత్రి రాజం విజ్ఞప్తి చేశారు.

కొడుకును కాపాడబోయి తల్లికి గాయాలు..

కోనరావుపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం నాగారంలో కుమారుడు విద్యుదాఘాతానికి గురికావడంతో కాపాడబోయిన తల్లి విద్యుదాఘాతానికి గురైంది. నాగారం గ్రామంలో విద్యుత్ మెయిన్ వైరు తెగి కింద పడిపోగా ఇంటి ముందు ఆడుకుంటూ వెళ్లిన అద్విక్ తీగను పట్టుకున్నాడు. గమనించిన తల్లి సుమ వైరును తొలగించే ప్రయత్నం చేయగా షాక్ తగిలి కింద పడిపోయింది. గ్రామస్థులు వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేసి చికిత్స నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. అక్కడ తల్లీకొడుకులు చికిత్స పొందుతున్నారు.

హత్యకు గురైన వ్యక్తి గుర్తింపు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం చంద్రంపేటలోని రాఘవేంద్ర రైస్‌మిల్ వెనుకాల దారుణ హత్యకు గురైన వ్యక్తి సిరిసిల్ల పట్టణానికి చెందిన బూస రమేశ్ (45)గా కుటుంబ సభ్యులు గురువారం గుర్తించారు. టౌన్ సీఐ కృష్ణ వివరాల ప్రకారం.. సంఘటనా స్థలంలో పడిఉన్న వస్తువుల ఆధారంగా ముగ్గురు వ్యక్తులు కలిసి మద్యం సేవించినట్లు ఉంది. మద్యం మత్తులో రమేశ్‌ను తలపై బండరాయితో మోది హత్యచేసినట్లు తెలుస్తోంది. రమేశ్‌పై పలు దొంగతనం కేసులు ఉన్నాయి. జులాయిగా తిరిగే రమేశ్‌ను ఎవరు హత్యచేసి ఉంటారనేది తెలియాల్సి ఉంది. రమేశ్‌కు భార్య లావణ్య, కుమార్తె రచన, కుమారుడు మల్లికార్జున్ ఉన్నారు. పోలీసులు కుటుంబ సభ్యుల స్టేట్‌మెంట్ రికార్డు చేసుకొని మార్చురీలో ఉన్న మృతదేహాన్ని అప్పగించారు. డాగ్ స్క్వాడ్ ఆధారంగా హంతకుల కోసం గాలింపు చేపట్టామని, మరోవైపు సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

అదనపు కట్నం వేధింపులతో భర్తకు జైలు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం భార్యను వేధించిన భర్తకు ఏడాదిన్నర జైలు శిక్షతో పాటు రూ.3వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ గురువారం తీర్పు వెల్లడించినట్లు ముస్తాబాద్ ఎస్‌ఐ గణేశ్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం... సిద్ధిపేట మండలంలోని పుల్లూరు గ్రామానికి చెందిన వనమా యాదగిరికి ముస్తాబాద్ గ్రామానికి చెందిన వనమా లక్ష్మితో 1996 సంవత్సరంలో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొన్నేళ్ల తర్వాత యాదగిరి అదనపు కట్నం తీసుకురావాలని భార్యను వేధింపులకు గురిచేసేవాడు. వేధింపులు భరించలేక 2015 సంవత్సరంలో లక్ష్మి ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో వనమా యాదగిరిపై ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో అప్పటి ఎస్‌ఐ మారుతి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ సందీప్ వాదించగా సిఎంఎస్ ఎస్‌ఐ శ్రావణ్ కోర్టు కానిస్టేబుల్ దేవేందర్ ఐదుగురు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ప్రవీణ్ నిందితునికి ఏడాదిన్నర జైలుశిక్షతో పాటు రూ. 3వేల జరిమానా విధించారని తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

సుల్తానాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గతేడాది డిసెంబర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన జాన్ ప్రకాష్ (22) అనే యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పెద్దపల్లి పట్టణం క్రిస్టియన్ కాలనీకి చెందిన వల్లెపు జాన్ ప్రకాష్‌తోపాటు వరుసకు సోదరుడైన కరుణాకర్‌లు డిగ్రీ పరీక్షలు రాయడానికి ఉదయం ఏడున్నర గంటలకు బైక్‌పై పెద్దపల్లి నుంచి బయలుదేరారు. సుల్తానాబాద్‌లో కొయ్యడ భాను అనే మరో మిత్రుడిని బైక్‌పై ఎక్కించుకుని ముగ్గురు కరీంనగర్ వెళ్తుండగా దుబ్బపల్లి వద్ద యూటర్న్ తీసుకుంటున్న లారీని ఢీకొన్నారు. ఈ సంఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడగా వీరిని ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. వీరిలో జాన్‌ప్రకాష్ బైక్ నడుపుతుండగా తీవ్ర గాయాలపాలయ్యాడని, హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ గురువారం మరణించాడని ఎస్‌ఐ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మహిళ అంబటి అమృత(52) ప్రమాదానికి గురై కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 25న మృతిచెందింది. ఆమె రెండో కూతురు స్రవంతి ఆమెరికాలో ఉండడంతో అంత్యక్రియలు నిర్వహించకుండా వేచిచూడాల్సి వచ్చింది. గురువారం కూతురు స్వగ్రామానికి చేరుకోవడంతో అమృత అంత్యక్రియలను నిర్వహించారు. మృతురాలికి భర్త రాజేందర్, కూతుర్లు సుమతి, స్రవంతి, మానసలు ఉన్నారు.

ప్రమాదానికి కారకుడైన ట్రాక్టర్ డ్రైవర్‌కు జైలు శిక్ష

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా ట్రాక్టర్ నడిపి ఒకరి మృతికి కారణమైన డ్రైవర్‌కు 20 నెలల జైలుశిక్ష, 4 వేల జరిమానా విధిస్తూ గురువారం గోదావరిఖని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నల్లాల వెంకట సచిన్‌రెడ్డి తీర్పునిచ్చారు. 2016 నవంబరు 19న అల్లూరు సబ్‌స్టేషన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రామగిరి మండలం లద్నాపూర్ గ్రామానికి చెందిన పొన్నంగౌడ్(48) అనే గీత కార్మికుడు మృతి చెందాడు. పొన్నంగౌడ్ భార్య పద్మతో కలిసి ద్విచక్ర వాహనంపై బొక్కలగుట్టకు వెళ్లి తిరిగి వస్తుండగా అల్లూరు సమీపంలో భీమగోని విద్యాసాగర్ వేగంగా ట్రాక్టర్ నడిపి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. మృతుడి బావమరిది పులిబాపు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోదావరిఖని టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి తీర్పునిచ్చారు. పోలీస్ సిబ్బందిని రామగుండం సీపీ శ్రీనివాస్, డీసీపీ చేతన, ఏసీపీ మడక రమేష్ అభినందించారు.

చెరువులో పడి పశువుల కాపరి మృతి

బీర్‌పూర్,ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పశువులను మేపడానికి వెళ్లి ప్రమాదవశాత్తూ అరగుండాల ప్రాజెక్టులో పడి పశువులు కాపరి మృతి చెందినట్లు ఏఎస్సై రవీందర్ గురువారం తెలిపారు. ఏఎస్సై రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గ్రామానికి చెందిన ఉయ్యాల రాజయ్య(60) అనే పశువుల కాపరికి ఎవరూ లేకపోవడంతో తన సోదరుడి వద్ద ఉంటూ పశువులను కాస్తూ జీవిస్తున్నాడు. బుధవారం ఉదయం 6 గంటలకు ఇంటి నుంచి పశువులను మేపడానికి వెళ్లిన రాజయ్య సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో తన తమ్ముడు చంద్రయ్య తన కుమారుడు ఉదయ్ కలిసి బుధవారం రాత్రి, గురువారం గాలించగా మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో అరగుండాల ప్రాజెక్టులో మృతదేహం కనిపించింది. ఈత రాక మృతిచెంది ఉంటాడని రాజయ్య సోదరుడు చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యూరియా కోసం ఇబ్బందులు

● గొల్లపల్లిలో గోదాంలోకి చొచ్చుకెళ్లేందుకు యత్నం ● ఆలూరులో బారులు తీరిన రైతులు ● పైడిమడుగులో కొరతతో ఆందోళన

గొల్లపల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలంలో యూరి యా కోసం గురువారం రైతులు ఆందోళన చేశారు. గొల్లపల్లి సింగిల్‌విండో కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు పలువురు రైతులు యత్నించడంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు, జిల్లా వ్యవసాయ అధికారి సంఘటనా స్థలానికి చేరుకొని రైతులకు నచ్చజెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది. గురువారం సింగిల్‌విండో కార్యాలయానికి 350 యూరియా బస్తాలు వచ్చాయనే సమాచారంతో రైతులు పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో కొంత మంది రైతులకు టోకెన్లు అందజేశారు. టోకెన్లు అందని రైతులు యూరియా కావాలంటూ ఒక్కసారిగా గోదాంలోకి దూసుకు పోయేందుకు ప్రయత్నించారు. సమయం దాటాక ఇచ్చే యూరియా మాకెందుకు అంటూ పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఎస్సై చిర్ర సతీష్ కుమార్ సంఘటనాస్థలికి వచ్చి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. జిల్లా వ్యవసాయ అధికారి రాంచంద్రం అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రైతులకు సరిపడా యూరియాను అందించేందుకు ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పడంతో రైతులు శాంతించారు. అనంతరం టోకెన్లు పొందిన రైతులకు యూరియా బస్తాలను పంపిణీ చేశారు. సింగిల్‌విండో సీఈవో బెజ్జెంకి రాంసుధాకర్‌రావు మాట్లాడుతూ ఐదు లారీల లోడ్‌లకు డబ్బులు చెల్లించామన్నారు. రెండు లారీల యూరియా పంపించారని, దీంతో రైతులు పెద్దఎత్తున రావడంతో కొంత గందరగోళం ఏర్పడిందన్నారు. టోకెన్ ప్రకారం ఒక్కో రైతుకు రెండేసి బస్తాల చొప్పున అందజేశామన్నారు.

● **రాయికల్:** మండలంలోని ఆలూరు గ్రామంలో యూరియా కోసం రైతులు బారులు తీరారు. గ్రామంలోని సహకార కేంద్రంలో రైతులకు సరిపడా ఎరువులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు స్థానిక రైతులు తెలిపారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో రైతులు వారి ఆధార్ కార్డులు, పాస్ బుక్‌లను క్యూలైన్‌లో పెట్టి వేచి చూస్తున్నారు. ప్రభుత్వం కావాల్సిన ఎరువులను సరఫరా చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.


పైడిమడుగులో లైనులో ఉంచిన పాస్‌బుక్కులు

● **కోరుట్ల రూరల్:** మండలంలోని పైడిమడుగు గ్రామంలోని సహకార సంఘ భవనం వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారు. చెప్పులు క్యూలో పెట్టుకున్న రైతులు యూరియా కొరకు ఎదురు చూశారు. సింగిల్ విండో కార్యాలయం వద్ద గురువారం ఉదయం రైతులు భారీగా చేరుకున్నారు. యూరియా పంపిణీ చేస్తున్న సయమంలో కేంద్రం వద్ద రైతులు భారీగా చేరడంతో సందడిగా మారింది. సుమారు 400 బ్యాగులు రైతులకు అవసరం ఉండంగా 125 బ్యాగులు రావడంలో ఆవేదన వ్యక్తం చేశారు.


గొల్లపల్లి సింగిల్ విండో వద్ద రైతులు


పైడిమడుగులో బారులు తీరిన రైతులు, క్యూలో చెప్పులు

షార్ట్ సర్క్యూట్‌తో కిరాణ షాపు దగ్ధం

రూ. 8 లక్షల నగదు, రూ. 30 లక్షల సామగ్రి ఆహుతి

మంథని రూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంజపడుగులో గురువారం తెల్లవారుజామున శివశంకర్ కిరాణం, అండ్ జనరల్ స్టోర్‌లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. గ్రామానికి చెందిన ఊదరి శంకర్ కిరాణ దుకాణంలో మంటలు చెలరేగి నగదుతో పాటు షాపులోని సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. బుధవారం శంకర్ షాపు మూసివేసి పక్కనే ఉన్న మరో ఇంట్లో కుటుంబ సభ్యులతో నివసిస్తున్నారు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో షాపులో మంటలు చెలరేగడంతో స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. మంథని ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిన తరలివచ్చి మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో ఇంటి మరమ్మతు కోసం అప్పుగా తెచ్చుకున్న రూ.7.80 లక్షల నగదుతోపాటు కౌంటర్‌లో ఉన్న రూ.30 వేలు దగ్ధమైనట్లు బాధితుడు శంకర్ తెలిపారు. సామగ్రి పూర్తిగా దగ్ధమై రూ.30 లక్షల వరకు నష్ట వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు. బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించారు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.


అగ్నిప్రమాదంలో దగ్ధమైన దుకాణాన్ని పరిశీలిస్తున్న పుట్ట మధు

పాము కాటుతో రైతు మృతి

చొప్పదండి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగంపేట పరిధిలోని బీరంరాజయ్యపల్లికి చెందిన రైతు ఎర్రం మల్లారెడ్డి(44) గురువారం పాముకాటుతో మృతిచెందాడు. రేవెల్లి శివారులో తన పొలంలో మల్లారెడ్డి పనిచేస్తుండగా పాము కాటు వేసింది. వెంటనే అతన్ని మొదట చొప్పదండి పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడ నుంచి కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మల్లారెడ్డి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనూష తెలిపారు.

ఇసుక డంప్‌ని పట్టుకున్న పోలీసులు

● ఐదుగురిపై కేసు నమోదు, వాహనాలు సీజ్


ఇసుక డంప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఓదెల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంపుల శివారు నుంచి ఇసుక అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న లారీని, డంప్ చేసిన ఇసుకను పొత్కపల్లి ఎస్‌ఐ దీకొండ రమేష్ బుధవారం రాత్రి పట్టుకున్నారు. పెద్దిరెడ్డి జనార్దన్ రెడ్డి, మణిదీప్, పొన్నగంటి సురేష్, కోరి భాస్కర్, రాజన్ కుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, గుంపుల పెట్రోల్ బంక్ పక్కన గల రైస్‌మిల్లు స్థలంలో అనుమతులు లేకుండా ఇసుక నిల్వ చేశారన్నారు. హైదరాబాద్‌కు తరలించడానికి లారీలో ఇసుక లోడ్ చేస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. నిలువ చేసిన దాదాపు 20 ట్రాక్టర్ల ఇసుకపై తహసీల్దార్‌కు సమాచారం ఇచ్చామని, కొందరు నేరస్తులు ఊక, ఇసుకను కలిపి కంటైనర్ లారీలో తరలిస్తుండగా పట్టుకొన్నామన్నారు.

ఎలాంటి అనుమతులు లేకుండా, ఎవరైనా ఇసుకను అక్రమంగా నిలువ చేసినా, తరలిం చినా చర్యలు తీసుకొంటామని ఎస్‌ఐ రమేష్ హెచ్చరించారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇసుక అక్రమ రవాణాపై ఎప్పటికప్పుడు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

బోల్తా పడిన లారీ.. తప్పిన ప్రమాదం

శంకరపట్నం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడికల్ శివారులో అదుపు తప్పి ఉనుక లారీ బోల్తాపడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేశవపట్నం వైపు నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ఉనుక లారీ అదుపుతప్పి గురువారం బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు.

అద్దె భవనంలో అంగన్‌వాడీ కేంద్రం

● పట్టించుకోని అధికారులు ● సౌకర్యాలు లేక చిన్నారుల అవస్థలు


ఎల్లారెడ్డిపేటలో నిరుపయోగంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక దశలోని చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రం-6 అద్దె భవనంలో కొనసాగుతోంది. ఇరుకైన గదులు, గాలి, వెలుతురు లేక ఉక్కపోత నడుమ చిన్నారులకు అవస్థమయంగా మారింది. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు పడుతున్న ఇబ్బందులను తీర్చేందుకు మండల కేంద్రంలో రెండేళ్ల క్రితం నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం అసంపూర్తిగా నిలిచిపోయింది. పనులను చేపట్టిన గుత్తేదారు పూర్తి స్థాయిలో చేయకపోవడం వల్ల వినియోగంలోకి రాకుండా పోయింది. తలుపులు తెరచి ఉండడంతో అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారుతోంది. మద్యం దుకాణానికి సమీపంలోనే అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్ర భవనంలో మందుబాబులు నిత్యం మద్యం సేవిస్తున్నారు. ఖాళీ మద్యం సీసాలను అక్కడే పడేస్తున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు తమకెందుకులే అన్నట్లు వ్యవహరిస్తుండడంతో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన భవనం నిరుపయోగంగా మారింది. ఆటపాటలతో కళకళలాడాల్సిన కేంద్రం ఖాళీ మద్యం సీసాలతో దర్శనమిస్తోంది. పనులను పూర్తి చేయించాల్సిన అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడంపై చిన్నారుల తల్లిదండ్రులు, గర్భిణీలు, బాలింతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కేంద్రానికి నిధులు మంజూరు చేసిన పర్యవేక్షణ లేక అసంపూర్తిగా మిగిలిపోయిందని వాపోతున్నారు. కేంద్ర భవనంలో అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్న పోలీసులు దృష్టి సారించకపోవడం ఏమిటనీ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి కేంద్రం భవన నిర్మాణ పనులను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకు వచ్చి అద్దె భవనంలో కొనసాగుతున్న కేంద్రాన్ని స్వంత భవనంలోకి మార్చాలని కోరుతున్నారు.

ఎన్నికల తర్వాత పనులు పూర్తి చేయిస్తాం

- లక్ష్మీరాజం, జిల్లా సంక్షేమ శాఖ అధికారి



ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-6 భవనం అద్దె గదిలో కొనసాగుతోంది. యేడాది కిందట మంజూరైన నిధులతో పనులను ప్రారంభించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల అనంతరం పనులను పూర్తి చేయిస్తాం. చిన్నారులకు వినియోగంలోకి తీసుకు వచ్చేలా చర్యలు చేపడుతాం.

అలంకారప్రాయంగా రైతు వేదికలు

● ఊరికి దూరంగా.. మందుబాబులకు అడ్డాగా

● నిరుపయోగంగా మారుతున్న కేంద్రాలు

పాలకుర్తి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): లక్షలు వెచ్చించి నిర్మించిన రైతు వేదికలు అలంకార ప్రాయంగా మారాయి. మరుగుదొడ్లు నిర్మించినా నీటి సౌకర్యం లేక అలంకారప్రాయంగా మిగిలాయి. ఊరికి దూరంగా నిర్మించడంతో కొన్ని రైతు వేదికలు మందుబాబులకు అడ్డాలుగా మారుతున్నాయి. పాలకుర్తి మండలంలోని మూడు రైతువేదికల పరిస్థితిపై ప్రత్యేక కథనం.

బీఆర్ఎస్ ప్రభుత్వం లక్షలు వెచ్చించి రైతువేదికలను నిర్మించింది. వ్యవసాయశాఖ అధికారులు అందుబాటులో ఉండేందుకు, సమకాలీన సాగు అంశాలపై ఎప్పటికప్పుడు రైతులతో సమావేశమయ్యేందుకు వీలుగా రైతువేదికలను ఏర్పాటుచేశారు. అయితే ఆ లక్ష్యం నెరవేరడం లేదు. ఎల్కలపల్లి, జయ్యారం, కుక్కలగూడూర్ పేరిట మండలంలో మూడు క్లస్టర్లు మంజూరయ్యాయి. జయ్యారం, ఎల్కలపల్లిలో ప్రభుత్వ స్థలం లేకపోవడంతో పుట్నూర్, పాలకుర్తిలో, కుక్కలగూడూర్‌లో రైతువేదికలు నిర్మించారు. మూడు రైతువేదికకు ప్రహరీ పూర్తి కాలేదు. గుత్తేదారులు నాసిరకంగా పనులు చేపట్టడంతో పగుళ్లు చూపుతున్నాయి. మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణం అసంపూర్తిగా ఉన్నాయి. మంచినీటి సౌకర్యం లేదు. కుర్చీలు, బల్లలు, బాత్‌రూమ్‌లు ఏర్పాటు చేశారు. కానీ నీటి వసతి కల్పించలేదు. గ్రామాలకు దూరంగా ఉండడంతో ఆయా పంచాయతీల పరిధిలోని రైతులు అక్కడకు వెళ్లడం లేదు. నిర్వహణ లేకపోవడంతో రాత్రి వేళల్లో మందుబాబులకు అడ్డాలుగా మారుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. సమావేశాలు నిర్వహించకపోవడంతో అవి నిరపయోగంగా మారాయి.

● మండలంలో వ్యవసాయశాఖ కార్యాలయానికి సొంత భవనం లేకపోవడంతో ఆ శాఖ అధికారులు రైతువేదికలో విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో మహిళా ఉద్యోగులతో పాటు మహిళా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వేదికల వద్ద మౌలిక వసతులు కల్పించాలని రైతులు కోరుతున్నారు.


పాలకుర్తిలోని రైతు వేదిక


పుట్నూర్ రైతు వేదిక వద్ద నిరపయోగంగా మరుగుదొడ్లు

రైతు వేదికల వద్ద మౌలిక వసతులు కల్పించాలి

బొడ్డు రాయమల్లు రైతు, కుక్కలగూడూర్

మండలంలో నిర్మించిన మూడు రైతువేదికల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా అప్పటి ప్రభుత్వం ప్రారంభించింది. గ్రామాలకు దూరంగా, కనీసం రోడ్డు సౌకర్యం కల్పించకుండానే రైతువేదికలు ప్రారంభించడంతో నిరుపయోగంగా మారాయి. తాగు నీటి సౌకర్యంతో పాటు రోడ్డు నిర్మాణం, మరుగుదొడ్లు ఏర్పాటు చేసి వాడుకలోకి తీసుకురావాలి.

వెళ్లొస్తాం రాజన్నా..

వచ్చే ఏడాది మళ్లీ వస్తాం..



- స్వగ్రామాలకు తిరుగుప్రయాణమైన రాజన్న భక్తులు
- పిల్లాపాపలు, పాడిపంటలను చల్లగా చూడాలని మొక్కులు
- ముగిసిన మూడు రోజుల రాజన్న మహాశివరాత్రి వేడుకలు

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వెళ్లొస్తాం రాజన్నా.. పిల్లాపాపలు, పాడి పంటలను చల్లగా చూడు.. అందరని క్షేమంగా చూస్తే మళ్లీ వచ్చే ఏడాదికి మళ్లీ నీ సన్నిధికి వచ్చి జాగరణ ఉపవాస దీక్ష చేస్తామంటూ భక్తులు వేములవాడ నుంచి స్వగ్రామాలకు తిరుగు ప్రయాణమయ్యారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రంలో మూడు రోజులపాటు నిర్వహించిన మహాశివరాత్రి జాతర విజయవంతంగా ముగిసింది. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలతో పాటుగా పట్టణ పురవీధులు మూడు రోజులుగా రద్దీగా మారాయి. భక్తులు బుధవారం రాత్రి రాజన్న ఆలయ గుడి చెరువులోని పార్కింగ్ స్థలంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన చలువ పందిళ్ల కింద ఎంతో నిష్టతో రాత్రంతా జాగరణ చేసి తెల్లవారి నైవేద్యం పెట్టి దీక్షను విరమించారు.



బద్ది పోచమ్మకు మొక్కులు..

జాగరణ అనంతరం భక్తులు మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని డప్పు చప్పుళ్ల మధ్య శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా బద్ది పోచమ్మ అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ ఈవో వినోద్‌రెడ్డి అదనంగా క్యూలైన్‌లు ఏర్పాటు చేయడంతో త్వరగా అమ్మవారి ఆలయంలోకి ప్రవేశించారు. పట్నాలు వేసి ఒడిబియ్యం పోసి నైవేద్యం సమర్పించి తిరుగు ప్రయాణమయ్యారు.

బియ్యంతో నిండిపోయిన కోటి లింగాలు..

వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి దక్షిణం వైపున్న కోటి లింగాలకు భక్తులు ఒడి బియ్యం సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే మహాశివ రాత్రి జాతరకు లక్షల మంది జనం రావడంతో భక్తులు సమర్పించిన ఒడిబియ్యంతో విగ్రహాలు బియ్యంలో కూరుకు పోయాయి. ఆలయ సిబ్బంది ఎప్పటికప్పుడు బియ్యాన్ని తొలగించిన భారీగా తరలివచ్చిన భక్తుల తాకిడికి కోటి లింగాలు బియ్యంతో నిండిపోయి కనిపించాయి. కాగా రాజన్న ఆలయానికి దర్శనానికి వచ్చిన ఓ భక్తురాలు తన బంగారు చైన్ పోగొట్టుకోవడంతో పార్వతిపురం ధర్మశాలలోని పారిశుధ్య విభాగం సిబ్బందికి దొరకడంతో తిరిగి భక్తులకు అందజేశారు. నిజాయితీని చాటుకున్న సిబ్బందిని ఆలయ ఈవో వినోద్‌రెడ్డి అభినందించారు.

ధర్మగుండంలో తొలగించని వ్యర్థాలు..

మహాశివరాత్రి జాతరకు వచ్చిన భక్తులు బుధవారం రాత్రి రాజన్న ఆలయ ధర్మగుండంలో జాగరణ కోసం పండ్లు, పూలతో దీపాలను వెలిగించారు. గురువారం మధ్యాహ్నం వరకు వ్యర్థాలను సిబ్బంది తొలగించకపోవడంతో భక్తులు అసహనం వ్యక్తం చేశారు. అంతేకాకుం డా శివదీక్ష తీసుకున్న శివస్వాములు తాము ధరించిన దుస్తువులను రాజన్న ఆలయ ధర్మగుండంలో వదిలివెళ్లగా సిబ్బంది తొలగించక పోవడంతో అలాగే ఉండిపోయాయి.

శివమయమైన వేములవాడ క్షేత్రం..

రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రం బుధవారం శివమయంతో నిండిపోయింది. పట్టణ పురవీధులతో పాటు ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. రాజన్న క్షేత్రంలో నిర్వహించిన మహాశివరాత్రి జాతర ఎంతో వైభవోపేతంగా నిర్వహించడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు. సుమారుగా 2 లక్షల 55 వేలకు పైగా భక్తులు గురువారం మధ్యాహ్నం వరకు వచ్చినట్లు అంచనా వేస్తున్నాం. భక్తులకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో జాతరను విజయవంతం చేయడం సంతోషంగా ఉంది. జాతర విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించిన బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, అన్ని శాఖల అధికారులతో పాటుగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులకు, రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులకు ప్రసాదం అందజేయడంతో ఎక్కడ లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా విధులు నిర్వర్తించిన ఏఈవో శ్రావన్‌కుమార్‌కు, ప్రొటోకాల్ ఏఈవో అశోక్, సూపరిండెంట్ శ్రీకాంతచారి, సీనియర్ అసిస్టెంట్ బొడుసు మహేష్ యాదవ్, ఎడ్ల శివసాయి, పురాణం వంశీ, జూనియర్ అసిస్టెంట్ సంహాచారిలకు ప్రత్యేక ధన్యవాదాలు.



సరిపోని చలువ పందిళ్లు..

మహాశివరాత్రి జాతరకు అనుకున్న దానికంటే ఎక్కువ మంది తరలిరావడంతో భక్తుల కోసం ఏర్పాటు చేసిన చలువ పందిళ్ల సరిపోలేదు. దీంతో భక్తులు గుడి చెరువులోని ఖాళీస్థలాల్లో వెంట తీసుకువచ్చిన పరదాలతో టెంట్‌లను ఏర్పాటు చేసుకుని విడిది చేశారు. మరికొంత మంది భక్తులు రాజన్న గుడి చెరువలో పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్స్‌ను సపోర్టు చేసుకుని పరదాలను కట్టుకుని ఎండతగలకుండా విడిది చేసి వంటలు చేసుకున్నారు.





స్వామివారి దర్శనానికి క్యూలో వెళుతున్న భక్తులు, వేములవాడ నుంచి తిరుగు ప్రయాణమవుతూ..

శివపార్వతుల శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న ప్రజలు

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పార్వతీ రాజరాజేశ్వరస్వామి కల్యాణోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం రాత్రి గోదావరిఖని కోదండ రామాలయం నుంచి శివపార్వతుల ఉత్సవవిగ్రహాల శోభాయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో, సిబ్బంది, ప్రధానఅర్చకుల అత్తెణ చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో శోభాయాత్ర కొనసాగింది. కేరళ డప్పు చప్పుళ్ళతో విద్యుత్ కాంతులతో హంసరథంలో కొనసాగిన యాత్ర విశేషంగా ఆకట్టుకుంది. భక్తులు ఉత్సవ విగ్రహాలను దర్శించుకున్నారు.

వేలాల మల్లన్నస్వామి జాతరకు తరలిన భక్తులు

మంథని, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని వేలాలలో కొలువై ఉన్న మల్లికార్జునస్వామి (మల్లన్న) జాతరకు మంథని ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో భక్తులు గురువారం తరలి వెళ్లారు. మంథని నియోజకవర్గంలోని వివిధ మండలాలు, గ్రామాలకు చెందిన భక్తులు వేలాలలో జరిగే మల్లన్నస్వామి జాతరకు ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో వెళ్లారు. మహాశివరాత్రి సందర్భంగా వేలాలలో జరిగే మల్లన్నస్వామి జాతరకు ఈప్రాంతం నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వెళ్ళి మొక్కులు చెల్లించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు, పట్నాలు, బోనాలు సమర్పిస్తారు.

చెన్నకేశవనాథ స్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రాయికల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని శ్రీ చెన్నకేశవనాథ స్వామి ఆలయంలో స్వామివారి రథోత్సవం గురువారం కన్నుల పండువగా జరిగింది. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాల అనంతరం ఉత్సవ విగ్రహాలైన శివపార్వతులను రథంపై ఉంచి ఆలయం చుట్టూ ఐదుసార్లు తిప్పారు. రథాన్ని లాగడానికి భక్తులు పోటీ పడ్డారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

దుబ్బరాజన్న ఆలయంలో భక్తుల సందడి



దుబ్బరాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

సారంగాపూర్, ఫిబ్రవరి, 27 (ఆంధ్రజ్యోతి): సారంగాపూర్ మండలంలోని దుబ్బరాజన్న క్షేత్రంలో గురువారం భక్తుల రద్దీ నెలకొంది. అర్చకులు స్వామి వారికి అన్నపూజ కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి గొడిసెల రాజేశం, సినీ వ్యాపారవేత్త మానాల పుల్లయ్య, మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్, బాపురెడ్డిలు దర్శించుకున్నారు. శుక్రవారం స్వామి వారి రథోత్సవం నిర్వహిస్తారు.

ఘనంగా సాంబశివ రథోత్సవం



బుగ్గారం వేడుకల్లో పాల్గొన్న శివ భక్తులు

బుగ్గారం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): బుగ్గారం మండల కేంద్రంలోని సాంబశివ నాగేశ్వర దేవాలయంలో రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివ భక్తులు రథాన్ని పూలమాలలతో అలంకరించి శివ భక్తులు, మహిళలు, దీక్ష స్వాములు రథమును లాగారు. ఈ వేడుకల్లో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ వేడుకల్లో నాయకులు బాధినేని రాజేందర్, వేముల సుభాష్, గాలిపెల్లి మహేష్, ఆలయ కమిటీ చైర్మన్ మసర్థి రాజిరెడ్డి పాల్గొన్నారు.

ధర్మపురిలో..



ధర్మపురిలో అక్కపెల్లి రాజరాజేశ్వర స్వామి రథోత్సవం

ధర్మపురి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శ్రీ అక్కపెల్లి రాజరాజేశ్వరస్వామి, శ్రీ రామలింగేశ్వరస్వామి, నేరెళ్ల, జైనాలో శ్రీసాంబశివుడి రథోత్సవాలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం శివ పార్వతుల ఉత్సవ మూర్తులను అక్కపెల్లి ఆలయం నుంచి గాంధీ చౌక్ మీదుగా నంది విగ్రహ చౌరస్తా వరకు ఊరేగించారు. శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివ పార్వతుల కల్యాణం జరిపారు. కార్యక్రమంలో వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌శర్మ, ఆలయ అర్చకులు ద్యావళ్ల విశ్వనాథశర్మ, జన్మంచి శ్రీనివాస్, బూస ప్రవీణ్ కుమార్, ద్యావళ్ల ప్రసన్న కుమార్, పర్వతగిరి ప్రశాంత్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సీపతి సత్యనారాయణ పాల్గొన్నారు.

పెగడపల్లిలో ..



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పెగడపల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో గురువారం స్వామివారి రథోత్సవ వేడుకలు కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం శివదీక్షాపరులు, భక్తులచే స్వామి వారి గ్రామ సందర్శనం శోభాయాత్ర నిర్వహించారు. రుద్ర హవనం, జయాదులు, బలిప్రధానం, మహాపూర్ణాహుతి, అన్నపూజ నిర్వహించి 6 వేల మందికి జాల తిరుపతి రెడ్డి కుటుంబ సభ్యుల సహకారంతో భక్తులకు అన్న, ప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఒరుగల శ్రీనివాస్, గుండి రాజేశ్వర శర్మ, శ్రీనివాస్ శర్మ, వినయ్ శర్మ, రాఘవ శర్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జూకంటికి కొలుకలూరి సాహితీ పురస్కారం ప్రదానం



అవార్డును ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ వరప్రసాద్

సిరిసిల్ల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : కథా రచయిత, కవి, విమర్శకులు జూకంటి జగన్నాథంకు జాతీయస్థాయి కొలుకలూరి భగీరథ కవితా పురస్కారం-2025 ప్రదానం చేస్తూ ఘనంగా సన్మానించారు. బుధవారం రాత్రి హైదరాబాద్‌లో తెలుగు యూనివర్సిటీ ఎన్టీఆర్ కళా ప్రాంగణంలో కొలుకలూరి పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. సాహిత్య రంగంలో విశేషంగా కృషి చేస్తున్న జూకంటి జగన్నాథం రచించిన 'ఒక కప్పు ఛాయ్... నాలుగు మేసేజ్‌లు' కావ్య సంపుటికి కొలుకలూరి పురస్కారాన్ని ఎమ్మెల్సీ మాణిక్య వరప్రసాద్, ద్రావిడ విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌ఛాన్సలర్ మధుజ్యోతి, సుమ కిరణ్‌లు పురస్కారాన్ని అందించి సత్కరించారు.

జాతీయస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌కు తల్లీకూతుళ్ల ఎంపిక


కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లాకు చెందిన తల్లీకూతళ్లు మేరి స్టెల్లా, షీలాస్మృతి జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌కు ఎంపికయ్యారు. సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో బుధవారం మాస్టర్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్స్ పోటీల్లో 50 ఏళ్ల పై వయస్సు విభాగంలో తల్లి మేరి స్టెల్లా జావెలిన్ త్రో, షాట్‌పుట్‌లో స్వర్ణ పతకాలు, 100 మీటర్ల పరుగుపందెంలో రజతం సాధించింది. కూతురు షీలాస్మృతి 30 ఏళ్ల పై వయస్సు విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో రజతం, 200 మీటర్ల పరుగు పం దెంలో కాంస్యం సాధించింది. ఏప్రిల్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో పాల్గొననున్నారు. రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి రామారావు, రూబెన్‌మార్క్, సుధీర్, దేవదానం, డేనియల్, సుదర్శనం, జాన్సన్ అభినందనలు తెలిపారు.



ప్రశంస పత్రాలు అందుకుంటున్న తల్లీకూతుళ్లు మేరి స్టెల్లా, షీలాస్మృతి

పరిశోధన ఫలాలు సమాజానికి

నేడు జాతీయ సైన్స్ దినోత్సవం



గణేశ్‌నగర్,ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన శాస్త్రం మన జీవితాల్లో వెలుగులు నింపుతోంది. సీవీ రామన్ ఫిబ్రవరి 28, 1928న రామన్ ఎఫెక్ట్‌ను కనుగొని భౌతిక శాస్త్రంలో సరికొత్త అధ్యయనానికి నాంది పలికారు. ఆ ఆవిష్కరణకు గుర్తుగా ఫిబ్రవరి 28ను 1986 నుంచి జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపుకుంటున్నాము. ప్రతి సంవత్సరం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఒక నిర్దిష్ట అంశం (థీమ్), కొత్త ఆవిష్కరణ లేదా సాంకేతికత ఆధారంగా జరుపుకుంటారు. ఈ సంవత్సరం 'వికసిత్ భారత్‌కీ సైన్స్ ఆవిష్కరణల్లో ప్రపంచ నాయకత్వం కోసం భారతీయ యువతకు సాధికారత' అనే అంశంపై జరుపుకుంటున్నారు. ప్రస్తుతం మన దేశం సైంటిఫిక్ రీసెర్చ్ పబ్లికేషన్‌లో ప్రపంచవ్యాప్తంగా మొదటి ఐదు దేశాల్లో ఒకటిగా ఉంది. ఇన్నోవేషన్ ఇండెక్స్ 40వ స్థానంలో ఉంది. చంద్రుడి దక్షిణ ధ్రువం పైకి విజయవంతంగా చేరిన తొలి దేశంగా భారత్ నిలిచింది.

వ్యవసాయ రంగంలో నూతన ఆవిష్కరణలు

అన్నదాతలకు సహాయకారిగా ఉండేందుకు శాస్త్ర వేత్తలు ఎన్నో ఆవిష్కరిణలు చేస్తున్నారు. తక్కువ పరిమాణంలో ఉండే నానో యూరియాతో రైతులకు మేలు జరుగుతోంది. సమర్థవంతమైన నానా యూరి యా ఉంటూ పర్యావరణహితంగా సమర్థవంతమైన పాత్ర పోషిస్తుంది. పురుగుల మందులు పిచికారి చేసే డ్రోన్లు అందుబాటులోకి వచ్చాయి. దీంతో రైతు లకు డబ్బులు, సమయం ఆదా అవుతోంది.

విద్యారంగంలో...

కొవిడ్ సమయంలో ఆన్‌లైన్‌లో పాఠాలు కొత్త అధ్యాయనాన్ని ప్రారంభిం చాయి. ఈ విధానంతో ప్ర పంచవ్యాప్తం గా ఉన్న విషయాలను తెలుసుకునే అవకాశం కలిగింది. వర్చువల్ రియాలిటీ, డిజిటల్ బోర్డులు మొదలైన పరికరాల ద్వారా విద్యార్థులు కొత్త విషయాలు తెలుసుకుంటున్నారు.

పర్యావరణ పరిరక్షణ

పెరుగుతున్నకాలుష్యం, వాతావరణ మార్పులు, సహజ వనరుల క్షీణత వంటి సమస్యలు మన భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. నేపథ్యంలో శాస్త్రవేత్తలు పర్యావరణ పరిరక్షణ కోసం నిరంతరం నూతన ఆవిష్కరణలకై పరిశోధనలు చేస్తూనే ఉన్నారు ప్లాస్టిక్ కాలుష్యం ప్రపంచవ్యాప్తం గా తీవ్ర సమస్యగా మారింది. శాస్త్రవేత్తలు ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైకిల్ చేయడానికి కొత్త పద్ధతులు కను గొంటున్నారు. జలసౌర, పవన విద్యుత్ పునరుత్పాద క ఇంధన వనరులు వినియోగం పెరుగుతుంది.

రవాణా రంగంలో..

వేగవంతమైన, సురక్షితమైన పర్యావరణ అనుకూ లమైన రవాణా వ్యవస్థల కోసం శాస్త్రవేత్తలు నిరంతరం పరిశోధనలు చేస్తూనే ఉన్నారు. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడంలో ఎంతో కీలకంగా మారాయి. బ్యాటరీ టెక్నాలజీలో పురోగతి, చార్జింగ్ స్టేషన్ల విస్తరణతో ఎలక్ట్రికల్ వాహనాల వినియోగం పెరిగిం ది. ప్యానెల్స్ ద్వారా ద్వారా చార్జింగ్ సౌకర్యం, వైర్లెస్ చార్జింగ్ వంటివి అందుబాటులోకి వస్తున్నాయి. డ్రైవర్ లేని వాహనాలు రవాణా రంగంలో పెద్ద మార్పులు తెస్తున్నాయి.

కృత్రిమ మేధస్సు

ఆధునిక యుగంలో సాంకేతిక పరిజ్ఞానం శర వేగంగా అభివృద్ధి చెందుతుంది. ఈ అభివృద్ధిలో కృత్రి మ మేధసు ముఖ్యపాత్ర పోషిస్తున్నది.కృత్రిమ మేధ స్సు అనేది కంప్యూటర్, యంత్రాలు మానవుల వలె ఆలోచించి, నేర్చుకొని, సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్ని కలిగి ఉండే ఒక సాంకేతికత. ఇది వివిధ రంగాల్లో అనేక శాస్త్రీయ ఆవిష్కరణలకు దారి తీసిం ది. వైద్య రంగంలో కృత్రిమ మేధస్సు చాలా ఉపయోగపడుతోంది.

సైన్స్ మన జీవితంలో ఒక భాగం

డాక్టర్ తిరుపతి, వృక్షశాస్త్ర అధ్యాపకుడు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కరీంనగర్



సైన్స్ మన జీవితంలో ఒక ముఖ్యమైన భాగం. ఇది మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి, సమస్యలను పరిష్కరించడానికి అదేవిధంగా కొత్త ఆవిష్కరణలు చేయడానికి సహాయపడుతుంది. జాతీయ సైన్స్ దినోత్సవం అనేది కేవలం ఒకరోజు కాదు, ఇది శాస్త్ర విజ్ఞానం పై మనకున్న నిబద్ధతకు ప్రతీక. భారతదేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో మరింత అభివృద్ధి సాధించ డానికి, యువతలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొం దించుకోవడానికి ఈ దినోత్సవం స్ఫూర్తినిస్తుంది.

ఓటేసిన ప్రముఖులు


ఓటేసిన అనంతరం సిరా చుక్కచూపుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు


మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా గురువారం పలువురు ప్రముఖులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ వినోద్ కుమార్, కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్నహరికృష్ణ, ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి రవీందర్ సింగ్, కరీంనగర్ పార్లమెట్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేశారు.


కుటుంబసభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి


బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ దంపతులు


ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థి రవీందర్ సింగ్ దంపతులు


కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు

పోలింగ్ కేంద్రాల సందర్శన

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గురువారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాలలో పోలింగ్ సరళిని, ఓటర్లకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుర్తింపుకార్డు చూసిన తర్వాతనే ఓటర్లను లోనికి అనుమతించాలని, ఎన్నికల నిబంధనల మేరకు పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చూడాలని ప్రిసైడింగ్ అధికారులను ఆదేశించారు.

జడ్పీ క్వార్టర్స్‌లో చోరీ

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ గోదాంగడ్డ ప్రాంతంలోని జిల్లా పరిషత్‌కు సంబంధిచిన క్వార్టర్స్‌లో చోరీ జరిగింది. జడ్పీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో రెడు ఏసీలు, రెండు కంప్యూటర్ మానిటర్లు, ఒక సంపు మోటారు, మరికొన్ని వస్తువులు చోరీకి గురైనట్లు సీఐ సృజన్‌రెడ్డి గురువారం తెలిపారు. ఘటనపై జడ్పీ అధికారి ఫిర్యాదు చేశారని, కేసు దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. జడ్పీ చైర్మన్ క్యాంపు కార్యాలయం ఖాళీ చేసి ఏడు నెలలు కావస్తోంది. క్వార్టర్‌కు తాళం వేసినట్లే ఉండగా ఏసీలు, మానిటర్లు, మోటారు, ఇతర వస్తువులు చోరీకి గురవడం గమనార్హం.

తాగునీటి సరఫరాకు ప్రత్యామ్నాయ చర్యలు

- పలు గ్రామాల్లో ఇబ్బందులు
- క్షేత్ర స్థాయిలో సమస్యల గుర్తింపు
- పరిష్కారానికి సన్నద్ధం


బోరు మరమ్మతు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు అధికారులు సన్నద్ధమయ్యారు. కరీంనగర్ మండలంలోని ఆయా గ్రామాల్లో మంచినీటి సరఫరాకు ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో తాగు,సాగు నీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో సమస్యను గుర్తించి పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి 10 తేదీ వరకు గ్రామాల్లో పర్యటించారు. చేతి పంపులు, పైపులైన్ల లీకేజీలు, రక్షిత తాగునీటి పథకాల అవసరమైన మరమ్మతులను గుర్తించారు. కరీంనగర్ మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో మిషన్ భగీరథ నీటితోపాటు రక్షిత తాగునీటి పథకం ద్వారా నీటి సరఫరా చేపడుతున్నారు. పలు గ్రామాలకు భగీరథ నీరు సరిపడా అందకపోవడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. మరోవైపు గ్రామాల్లో నీటి సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకునేందుకు ఎంపీడీవో సంజీవరావు, ఎంపీవో జగన్‌మోహన్ రెడ్డి, మిషన్ భగీరథ ఇంట్రాగ్రిడ్ ఏఈలు వినయ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంపు ఆపరేటర్లు స్థానికులతో మాట్లాడి నీటి సరఫరా ఇబ్బందులు తెలసుకున్నారు. బహదూర్‌ఖాన్ పేట, ఫకీర్ పేటతోపాటు పలు గ్రామాల్లో చేతి పంపులకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు చేపట్టడంతోపాటు నీటి నాణ్యత పరీక్షలు, క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు. ఎలబోతారం, నగునూర్‌కు మిషన్‌భగీరథ నీరు రాకపోవడంతో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. తీగలగుట్టపల్లి నుంచి నగునూర్ వరకు రక్షిత బావికి భగీరథ ప్రధాన పైపులైన్ లింక్ చేసే అవకాశాన్ని సంబంధిత అధికారులతో పరిశీలించారు. ఇరుకుల్ల భగీరథ నీటిని తాగేందుకు ప్రజలు ముందుకు రాకపోవడంతో ప్రత్యామ్నాయంగా నీరు సరఫరా చేయాలని గతంలోనే ఆదేశించారు. ఏప్రిల్, మేలో నీటి ఎద్దడి తలెత్తితే ఆయా గ్రామాల్లోని వ్యవసాయ బావులను అద్దెకు తీసుకొని నీటిని అందించాలని నిర్ణయించారు. ఇందుకోసం రూ.48.45 లక్షలతో ప్రతిపాదనలు రూపొందించారు. నిధులు మంజూరు చేయాలని కోరుతూ కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపారు. ఆయా గ్రామాల్లో చేపట్టబోయే మొత్తం 29 పనులకు సంబంధించి నిధులను మంజూరు చేసేందుకు చర్యలు చేపట్టారు. దీంతోపాటు బావుల్లో పూడికతీత, కొత్త బావుల తవ్వకం పైపులైన్ల లీకేజీల మరమ్మతు, కొత్త పైపులైన్, కొత్త విద్యుత్ మోటార్ల కొనుగోలు తదితర వాటికి నిధులు ఖర్చు చేయనున్నారు. ఇందుకు గ్రామాల వారీగా నిధులను కలెక్టర్‌కు పంపించారు. చెర్లబూత్కూర్‌కు రూ.7.50 లక్షలు, చేగుర్తి రూ.7లక్షలు, ఫకీర్‌పేట రూ.3లక్షలు, నగునూర్ రూ.9.50లక్షలు, నల్లగుంటపల్లి రూ.1.50 లక్షలు, దుబ్బపల్లి రూ.2.70 లక్షలు, ఇరుకుల్ల రూ.1.50 లక్షలు, మొగ్దుంపూర్ రూ.5. 50 లక్షలు, చామనపల్లి రూ.2.50లక్షలు, ఎలబోతారం రూ.4లక్షలు, తహెర్ కొండాపూర్, మందులపల్లి, బహదూర్‌ఖాన్‌పేటకు కలిపి రూ.3లక్షలు, జూబ్లీ నగర్‌కు 75వేల రూపాయలను గ్రామాల వారీగా ప్రతిపాదించారు.


అడుగంటిన బావి

కళాశ్రీ పురస్కారానికి కాండూరి వెంకటేశ్వర్లు ఎంపిక

కరీంనగర్, కల్చరల్ ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): దశాబ్ద కాలంగా సాహితీవేత్తలను సత్కరిస్తూ సామాజిక మాధ్యమాల్లో కవి సమ్మేళనాలు నిర్వహిస్తున్న కళాశ్రీ వేదిక నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకు ఎలాంటి పురస్కారం స్వీకరించని కవి ఇంటికి కళా బృందం వెళ్లి 'కవి ఇంటికి కళాశ్రీ పురస్కారం' పేరుతో సత్కరించనుంది. ఇందులో భాగంగా తొలి పురస్కారానికి కవి, రచయిత, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, వరాహమిహిర జ్యోతిషాలయ నిర్వాహకుడు కాండూరి వెంకటేశ్వర్లు ఎంపికైనట్లు వేదిక నిర్వాహకుడు గుండేటి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఇది నెలకోసారి జరిగే ప్రక్రియ అని, దీనికి కొత్త అనిల్‌కుమార్ సమన్వయకర్తగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. వెంకటేశ్వర్లుకు సప్తగిరి కాలనీలోని ఆయన నివాసంలో శుక్రవారం సాయంత్రం సాహితీ వేత్త డాక్టర్ గండ్ర లక్ష్మణరావు చేతుల మీదుగా పురస్కారం అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

పుస్తకాల అందజేత


పుస్తకాలు అందజేస్తున్న దాస్యం సేనాధిపతి

కరీంనగర్ టౌన్/కరీంనగర్, కల్చరల్ ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని సరస్వతీ శిశుమందిర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల గ్రంథాలయానికి సరస్వతీ విద్యాపీఠం ఒకప్పటి జ్యేష్ఠ కార్యకర్త, కవి, రచయిత దాస్యం సేనాధిపతి 17వేల రూపాలయల విలువ చేసే పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు సేనాధిపతికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్ష కార్యదర్శులు బల్మూరి కరుణాకర్‌రావు, కోల అన్నారెడ్డి, సమితి అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ చక్రవర్తుల రమణాచార్యులు, ఎలగందుల సత్యనారాయణ, విభాగ్ కార్యదర్శి మేచినేని దేవేందర్‌రావు, సహ కార్యదర్శి కొండా గంగాధర్, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, పులాల శ్యామ్, గట్టు శ్రీనివాస్, రాపర్తి శ్రీనివాస్, డాక్టర్ నాళ్ల సత్యవిద్యాసాగర్, తాటి రాజేశ్వరరావు, చందా సుధాకర్, శ్రీరాం మొండయ్య, కేశెట్టి మహేశ్, బన్నా సుధాకర్, హెచ్ఎం సముద్రాల రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న యువతి

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):కరీంనగర్ మండలం దుర్శేడ్ గ్రామానికి చెందిన కదుకూరి అఖిల ఇటీవల డల్లాస్ నుంచి వచ్చింది. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కరీంనగర్ పట్టణంలోని సుభాష్‌నగర్‌లోని ఎస్సీ బాలికల కళాశాలలో పోలింగ్ కేంద్రంలో గురువారం ఓటు హక్కు వినియోగించుకుంది. ఈ సందర్భంగా ఓటు హక్కు వినియోగించుకోవడంపై సంతోషం వ్యక్తం చేసింది.

పట్టభద్రులకు రుణపడి ఉంటా

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): తనపై విశ్వాసంతో ఓటు వేసిన పట్టభద్రులకు రుణపడి ఉంటానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి దయ్యాల ఓంప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు సేవ చేయడానికి ఎల్లప్పుడూ ముందుంటానని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై గొంతెత్తడం తనకు కొత్తేమీ కాదని, 30 సంవత్సరాలుగా ప్రజలకు సేవ చేస్తున్నానని తెలిపారు.

మద్దతు తెలిపిన వారందరికీ ధన్యవాదాలు

- కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి


మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 27 (ఆంధ్ర జ్యోతి): కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతు తెలిపినవారితోపాటు పట్టభద్రుల ఓటర్లకు కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్ నరేందర్‌రెడ్డి గురువారం ధన్యవాదాలు తెలిపారు. పోలింగ్ ముగిసిన అనంతరం నగరంలోని ఎమ్మెల్సీ ఎన్నికల కార్యాలయంలో పోలింగ్ సరళిపై తన అనుచరులు, కాంగ్రెస్ శ్రేణులతో చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని రోజులుగా తనతో కలిసి పనిచేసిన అల్ఫోర్స్ కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ శ్రేణులు, సంఘాల నాయకులు, మీడియాకు కృతజ్ఞతలు తెలిపారు.

● పోలింగ్ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి గురువారం పలు కేంద్రాల వద్ద పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు.

● ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధిస్తున్నారని ఆ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు, సీఎం రేవంత్‌రెడ్డికి పట్టభద్రులు, నిరుద్యోగులు అండగా ఉన్నారని పేర్కొన్నారు. నగరంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించినట్లు తెలిపారు.

ప్రభుత్వానికి, పట్టభద్రులకు వారధిగా నిలవాలి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్


మాట్లాడుతున్న గంగుల కమలాకర్, వినోద్‌కుమార్

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 56 మంది అభ్యర్థులు పోటీ చేశారని, ఏ పార్టీ అభ్యర్థి గెలిచినా ప్రభుత్వానికి, పట్టభద్రులకు మధ్య వారధిగా నిలవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. గురువారం వాణినీ కేతన్ కళాశాలలోని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం పోలింగ్ కేంద్రం నుంచి బయటకు వస్తూ మీడియాతో మాట్లాడారు. పార్టీ కోసమే కాకుండా నమ్మకంతో ఓటు వేసి గెలిపించిన పట్టభద్రుల డిమాండ్ల సాధనకు కృషి చేయాలని కోరారు. గతంలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో ఓటరుగా నమోదు చేయించుకోలేదని, ఇప్పుడే మొదటి సారి ఎమ్మెల్సీ ఓటు వేశానని తెలిపారు. బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో అభ్యర్థులను పోటీలో నిలపలేదని, 56 మంది అభ్యర్థుల్లో ఎవరు పట్టభద్రుల డిమాండ్ల సాధన కోసం కృషి చేస్తారో ఆలోచించి ఓటు వేశానని తెలిపారు. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు రాబోయే నూతన విద్యా విధానానికి నాందిగా నిలవాలని, నిలుస్తాయని ఆకాంక్షిస్తున్నానని అన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా మాజీ చైర్మన్ జీవీ రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

● ఉదయం మందకొడిగా ప్రారంభమై మధ్యాహ్నానికి పుంజుకున్న ఓటింగ్


హుజూరాబాద్‌లో ఓటు వేసేందుకు బారులు తీరిన పట్టభద్రులు

హుజూరాబాద్/హుజూరాబాద్‌రూరల్/సైదాపూర్/శంకరపట్నం/జమ్మికుంట/జమ్మికుంటరూరల్/వీణవంక/రామడుగు/చొప్పదండి/మానకొండూర్/గంగాధర/గన్నేరువరం/చిగురుమామిడి: ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం మండల కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగాయి. ఆయామండలాల్లో ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరగగా, మధ్యాహ్నంవేళలో ఓటర్లు అధిక సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. కొన్నిపోలింగ్ కేంద్రాల్లో ఒకేసారి ఓటర్లు రావడంతో సాయంత్రం 6గంటల వరకు ఓటింగ్ జరిగింది. హుజూరాబాద్‌లోనియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు, మాజీఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్, ఇంద్రనీల్ తమఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాలవద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. జమ్మికుంటలో సాయంత్రం 7గంటల వరకు క్యూలో నిలబడి ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

అస్వస్థత: జమ్మికుంట పోలింగ్ కేంద్రంలో ఎన్నికల సిబ్బంది మైస కరుణాకర్, జూనియర్ అసిస్టెంట్ హరి అస్వస్థతకు గురయ్యారు. అప్రమత్తమైన అధికారులు వారిని చికిత్సనిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

జమ్మికుంట, వీణవంక మండలాల్లో పట్టభద్రుల ఓటర్లు ఓటువేయడానికి చాలాసేపు వేచి ఉండాల్సి వచ్చింది. జమ్మికుంటలో అధికారులు మూడు పోలింగ్‌స్టేషన్లు మాత్రమే ఏర్పాటు చేయగా ఓటర్లు ఇబ్బంది పడ్డారు. 700ఓటర్లకు ఒక పోలింగ్‌స్టేషన్ ఏర్పాటు చేసి ఉంటే ఓటింగ్ ఆలస్యం అయ్యేది కాదని పట్టభద్రులు అభిప్రాయం వ్యక్తం చేశారు. పట్టభద్రుల బ్యాలెట్ పేపర్ పెద్దదిగా ఉండటం కూడా ఆలస్యం కావడానికి ఒక కారణమని వారు తెలిపారు. వీణవంక మండలంలో 26గ్రామాలకు రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి 1000 మందికి ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటుతో పట్టభద్రులు ఓటింగ్ కోసం గంటల కొద్ది వేచి ఉండాల్సి వచ్చింది. దీంతో అధికారుల ఏర్పాట్ల పై ఓటర్లు అసహనం వ్యక్తం చేశారు.

రామడుగులో సాయంత్రం 4గంటల తర్వాత పోలింగ్ ముగిసే సమయానికి వందలాది మంది పట్టభదు్రలు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి గంటల తరబడి వేచి ఉండటంతో వారికి ప్రత్యేకటోకెన్లు అధికారులు అందజేశారు. పోలింగ్ సరళిని ట్రైనీఅసిస్టెంట్ కలెక్టర్ అజయ్‌యాదవ్, తహసీల్దార్ వెంకటలక్ష్మీ, ఎంపీడీవో రాజేశ్వరి పరిశీలించారు. ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, ప్రసన్నహరికృష్ణతోపాటు ఎస్ఎస్‌యూఐ రాష్ట్రఅధ్యక్షుడు వెంకటస్వామి పరిశీలించారు. జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న, సింగిల్‌విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు, మాజీ ప్రజాప్రతినిధులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

మండలాల్లో గురువారం జరిగిన పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సరళి కింది విధంగా ఉంది..

మండలం	పట్టభద్రులు	ఓటేసింది	పోలింగ్‌శాతం	ఉపాధ్యాయులు	ఓటేసింది	పోలింగ్‌శాతం
హుజూరాబాద్	4795	3312	69.07	287	263	94
మానకొండూర్	3548	2264	63.81	48	45	93.75
చొప్పదండి	3092	2102	67.98	114	110	98
సైదాపూర్	1981	1147	57.90	54	52	96.29
శంకరపట్నం	2009	1423	70.83	51	49	96.07
తిమ్మాపూర్	2866	1970	68.73	87	81	93.10
గంగాధర	2936	1954	65.55	110	94	85.45
గన్నేరువరం	842	572	67.93	10	10	100
జమ్మికుంట	3177	2082	66	206	191	92.71
రామడుగు	3217	2151	66.86	79	75	94.93
చిగురుమామిడి	2230	1438	66.50	51	49	96.07
ఇల్లందకుంట	1182	821	69.45	41	40	97.65
వీణవంక	2188	1430	65.35	41	39	95.12

మానకొండూర్ మండలంలో నాలుగు గంటలలోపు పోలింగ్ కేంద్రంలో ఉన్న ఓటర్లకు కొత్త పోలింగ్ చిట్టీలను అందజేసి ఇరువైపులా గేట్లను మూసివేశారు. 5గంటల 56 నిమిషాలకు పోలింగ్ పూర్తి కాగా పోలింగ్ సిబ్బంది పెట్టెలను పోలీసుల సమక్షంలో సీలు చేశారు. ఎండను సైతం లెక్క చేయకుండా పోలింగ్ పూర్తి అయ్యేంత వరకు చిన్న పిల్లలను వెంబడి తీసుకవచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారామణ-అనురాధ దంపతులు, మాజీఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

గంగాధర మండలంలో పోలింగ్‌సరళిని ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ అజయ్‌యాదవ్, ఏసీపీ శుభంనాగర్లే, తదితరులు పర్యవేక్షించారు. బీఎస్పీపట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ ఓటింగ్ కేంద్రాన్ని పరిశీలించి పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. గన్నేరువరంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పోలింగ్ కేంద్రం బయట కార్యకర్తలతో మాట్లాడి ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు.

● బీజేపీ నాయకులు, పోలీస్‌లకు మధ్య వాగ్వాదం..

జమ్మికుంట/ జమ్మికుంట రూరల్: జమ్మికుంట పోలింగ్ కేంద్ర వద్ద బీజేపీనాయకులు పార్టీ కండువాలు మెడలో వేసుకోగా, వాటిని తీయాలని రూరల్‌సీఐ కిషోర్ సూచించారు. ఇద్దరి మధ్య మాటమాట పెరిగి వాగ్వాదం నెలకొంది. పార్టీగుర్తు లేనప్పుడు కండువాలతో ఇబ్బంది ఏం ఉందని బీజేపీ నాయకులు వాదించారు.

● కాంగ్రెస్, బీజేపీ నాయకుల మధ్య స్వల్ప ఘర్షణ..

చిగురుమామిడి: మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా గురువారం కాంగ్రెస్, బీజేపీ నాయకుల మధ్య స్వల్పఘర్షణ జరిగింది. కాంగ్రెస్ నాయకులు ఓ వాహనంలో డబ్బులు పంపిణీ చేశారని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఆ పార్టీ నాయకుడి వాహనాన్ని అడ్డుకుని కొద్దిసేపు ఘర్షనకు పాల్పడ్డారు. సీఐ స్వామి, ఎస్సై రాజేశ్ వచ్చి ఇద్దరికీ నచ్చజెప్పి అక్కడి నుంచి పంపేశారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కాంగ్రెస్‌పార్టీ నాయకులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు మాజీజడ్పీటీసీ గీకురు రవీందర్ తెలిపారు. బీజేపీ నాయకులు తన వాహనాన్ని అనవసరంగా అడ్డుకుని, ధ్వంసం చేశారని, దౌర్జన్యం చేశారని బీజేపీ నాయకులపై ఫిర్యాదు చేసినట్లు కాంగ్రెస్‌నాయకులు తెలిపారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేసి చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు. కాగా మండల కేంద్రంలో పోలింగ్ సరళిని మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ పరిశీలించారు. పార్టీ కార్యకర్తలతో, నాయకులతో మాట్లాడారు. ఓటింగ్ శాతం పెరిగేలా కృషి చేయాలన్నారు.

తిమ్మాపూర్: తిమ్మాపూర్ మండలంలోని మహాత్మానగర్ గ్రామం ఎల్ఎండీ కాలనీలో గ్రాడ్యుయేట్స్ ఓటర్లు ఓటు వేసేందుకు భారీగా తరలివచ్చారు. కొందరు ఓటింగ్ ఆలస్యం జరుగుతుండడంతో వేయకుండానే వెళ్లిపోయారు.4గంటలు దాటిన తరువాత ఒకరిద్దరు ఓట్లు వేసేందుకు రాగా అధికారులు గేట్లు వేసేశారు.

●పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఎన్నికల అబ్జర్వర్, సీపీ

తిమ్మాపూర్: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కేంద్రాన్ని సీపీ అభిషేక్ మహంతి, ఎన్నికల అబ్జర్వర్ బుద్ధప్రకాష్ వేరువేరుగా సందర్శించి పరిశీలించారు. సీపీ మీడియాతో మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదని వెల్లడించారు. బుధవారం పోలింగ్ మెటీరియల్ తీసుకున్నప్పటి నుంచి భారీబందోబస్త్ నడుమ ఎస్కార్ట్ ఏర్పాటు చేసి పోలింగ్ కేంద్రాలకు తరలించినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద భారీ పోలీస్ ఫోర్స్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికల అనంతరం బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూములకు తరలించేవరకు పూర్తిస్థాయిలో బందోబస్త్ ఏర్పాటు చేశామని తెలిపారు.


జమ్మికుంటలో పోలీస్‌తో బీజేపీ నాయకుల వాగ్వాదం


ఎల్ఎండీకాలనీలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీపీ అభిషేక్ మహంతి

శివ నామస్మరణతో మారుమోగిన సిరిసేడు

ఇల్లందకుంట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిసేడు గ్రామంలోని శ్రీఅపర్ణ సోమేశ్వరస్వామి దేవాలయం శివనామస్మరణతో బుధవారం రాత్రి మారుమోగింది. శివపార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయచైర్మన్, డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహాఅన్నదానం

వీణవంక, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని శివాలయంతోపాటు నర్సింగాపూర్ ఉమామహేశ్వర ఆలయంలో శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. గురువారం మహాఅన్నదాన కార్యక్రమం చేపట్టారు. అనంతరం శోభాయాత్ర కన్నుల పండువగా నిర్వహించారు. మహిళలు కోలాటాలతో నృత్యాలు చేశారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని

గంగాధర, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం గర్శకుర్తికి చెందిన విద్యార్థిని జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. గర్శకుర్తిలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేసిన జగదీశ్వర్‌రెడ్డి విద్యార్థులకు సెన్సార్లమీద శిక్షణ ఇచ్చి ఇప్పటివరకు 37రకాల ప్రాజెక్టులు రూపొందించారు. అందులో 2023-24సంవత్సరానికి జనవరిలో జరిగిన ప్రదర్శనలో గర్శకుర్తి విద్యార్థిని ప్రదర్శన జాతీయ స్థాయికి ఎంపికైంది.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి

తిమ్మాపూర్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్ఎండీకాలనీలో గల శ్రీ వెంకటేశ్వర దేవాలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబయింది. ఫిబ్రవరి28నుంచి మార్చి1 వరకు రెండురోజులపాటు బ్రహ్మో త్సవాల్లో భాగంగా అధ్యయనోత్సవాలు జరుగనున్నట్లు దేవాలయకమిటీ చైర్మన్ మారం జగదీశ్వర్ తెలిపారు. మార్చి4న వెంకటేశ్వర స్వామి పద్మావతి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.